క్లుప్తంగా

థ్యాంక్యూ సీఎం సార్..



క్రోసూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ మోడల్ స్కూల్ రెగ్యులర్ సిబ్బంది, ఉపాధ్యాయులను స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసినట్లు ప్రభుత్వం జీవో విడుదల చేయటంపై క్రోసూరు మోడల్ స్కూల్ ప్రిన్స్‌పల్ మేరీ సుజన్, ఉపాధ్యాయులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో థ్యాంక్యూ సీఎం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు సిబ్బందికి ఇక నుంచి జీరో వన్ జీరో హెడ్ (010) ద్వారా జీతాలు చెల్లించేందుకు ఆదేశాలు రావటంపై హర్షం వ్యక్తం చేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సత్తెనపల్లి: రెంటపాళ్ల గ్రామంలో శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి నూర్ బాషా(దూదేకులు)లు క్షీరాభిషేకం చేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ నూర్ భాషాలను కులం పేరుతో దూషిస్తే శిక్ష తప్పదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇకపై సమాజంలో కానీ, సినిమాల్లో కానీ నూర్ భాషాలను దూషిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూర్ భాషాలు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయానికి నిప్పంటించిన వ్యక్తుల అరెస్ట్

అమరావతి: దరణికోట గ్రామంలో శుక్రవారం ఉదయం వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయానికి టీడీపీ కార్యకర్తలు పెట్రోలు పోసి, నిప్పంటించారు. ఈ ఘటనలో నిందితులను అరెస్టు చేసి శనివారం అమరావతి పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ ఏవీ బ్రహ్మం మాట్లాడారు. తాటాకుల పైకప్పుతో ఉన్న గ్రామ వైఎస్సార్ సీపీ ఎన్నికలకార్యాలయాన్ని తగులబెట్టిన నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. రిమాండు నిమిత్తం సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు నిందితులు వడ్లమూడి రమణ, పాకాలపాటి పూర్ణ చంద్రరావుకు రిమాండ్ విధించినట్లు చెప్పారు. దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ వి-204-ఏ వాసవి మణికంఠ క్లబ్ సభ్యులు ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్రన్ ఆదేశాల మేరకు పట్టణంలోని గోళ్ళమూడి వారి వీధిలో చలివేంద్రం శనివారం ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు వనమా నాగేశ్వరరావు, సెక్రటరీ పి.సాంబశివరావు, ట్రెజరర్ సూరే శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ కొప్పురావూరి కాశీ, మోటమర్రి వేణు, మన్నెం కిషోర్ ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



సత్తెనపల్లి: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పట్టణ ప్రజలు సహకరించాలని సత్తనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు కోరారు. గుంటూరు ఇంటెలిజెన్స్ సీఐగా పని చేస్తూ ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. శనివారం సత్తెనపల్లి టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేసిన పి.ప్రభాకర్ గుంటూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. 2009 ఎస్ఐ బ్యాచ్ కి చెందిన శ్రీనివాసరావు 2023లో సీఐగా పదోన్నతి పొందారు. నెల్లూరు డీసీఆర్‌బీలో చేసి గుంటూరు ఇంటిలిజెన్స్ సీఐగా వచ్చారు. సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు.

రాజీ మార్గమే రాజ మార్గం

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), మండల న్యాయ సేవాదికర సంస్థ చైర్మన్ డి.నాగ వెంకటలక్ష్మి అన్నారు. పట్టణంలోని నాలుగు న్యాయ స్థానాల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. మొత్తం రెండు బెంచ్ లుగా నిర్వహించారు. మొదటి బెంచ్‌కు న్యాయమూర్తిగా డి.నాగ వెంకటలక్ష్మి, మెంబర్‌గా న్యాయవాది కంబాల అనిల్ కుమార్, రెండవ బెంచ్‌కు న్యాయమూర్తిగా మహమ్మద్ గౌస్, మెంబరుగా న్యాయవాది బి.అమర్ నాయక్ వ్యవహరించారు. లోక్ అదాలత్‌లో సివిల్-19, క్రిమినల్-87 కేసులు వెరశి 106 కేసులు పరిష్కరించారు. వీటి ద్వారా రూ. 1,72,88,256 చేతులు మారాయి. న్యాయ వాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరకలెత్తే సమరోత్సాహం..!



బుల్లెట్ వాహనంపై మంత్రి అంబటి రాంబాబు ర్యాలీ..

- సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అంబటి రాంబాబు
- బాణ సంచా కాల్చి సంబరాలు చేసుకున్న శ్రేణులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అంబటి రాంబాబు పేరు అధికారికంగా ఖరారవడంతో శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన మెజార్టీ కంటే అత్యధిక మెజార్టీతో అంబటి రాంబాబు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. వరుసగా మూడోసారి అంబటి రాంబాబు పేరును అధిష్టానం అధికారికంగా ప్రకటించడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

పోరాటాలతో రాటు తేలి అంబటి..

సత్తెనపల్లి నియోజకవర్గంలో 2012 నుంచి వైఎస్సార్ సీపీ తరఫున అంబటి రాంబాబు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి 926 స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. నాటి నుంచి కార్యకర్తల్లో ఒక రకమైన స్తబ్ధత నెలకొంది. ఇలాంటి కీలక సమయంలో అంబటి రాంబాబు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు భుజాలకెత్తుకొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. నిరాశను కేడర్ దరిచేరనీయలేదు. అధికార టీడీపీ వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిత్యం నిరసిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఎప్పటికప్పుడు టీడీపీ అక్రమాలను క్షేత్రస్థాయిలో ఎండగడుతూ పోరాటాలు చేశారు. దాని ఫలితమే.. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన ప్రత్యర్థి డాక్టర్ కోడెల శివ ప్రసాద్‌పై 20 వేల పైచిలుకు మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్యాబినెట్‌లో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రతిపక్షాలు తనను ఎంత టార్గెట్ చేయాలని చూసినా.. అంతే దీటుగా వారికి సమాధానం చెప్పడం మంత్రి అంబటి ప్రధాన బలం. అంబటి వరుసగా మూడోసారి సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనుండడంతో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు చేతబూని బాణ సంచా కాల్చి అంబరాన్నంటేలా సంబరాలు చేసుకున్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పార్టీ నాయకులు కాకుమాను రవి, అవ్వారు శ్రీనివాసరావు, సెగ్గెం వెంకటేశ్వరరావు, గుంటూరు సుషీంద్ర కుమార్, తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, నాగుల్‌బాషా, వాకుమళ్ళ చెంచిరెడ్డి, అన్నం వేణు, తదితరులు ఉన్నారు.

బుల్లెట్‌పై ర్యాలీ

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేరును అధిష్టానం ప్రకటించడంతో.. మంత్రి అంబటి బుల్లెట్‌పై ఆనందం వ్యక్తం చేస్తూ.. ర్యాలీ నిర్వహించారు. తన నివాసం నుంచి పట్టణంలోని తాలూకా సెంటర్, ఐదులాంతర్ల సెంటర్ మీదుగా చెక్ పోస్ట్ వరకు సాగి తిరిగి ఇదే మార్గంలో హోలీ ఫ్యామిలీ స్కూల్ వరకు సాగి.. బస్టాండ్ మీదుగా పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. భారీ సంఖ్యలో పాల్గొన్న అశేష అభిమానులు జై జగన్, జై అంబటి అంటూ నినాదాలు చేశారు. ప్రధాన కూడళ్లలో టపాసులు పేల్చి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. ప్రస్తుతం బుల్లెట్ వాహనంపై పర్యటిస్తూ, స్థానికులను పలకరిస్తూ, కార్యకర్తలను పరామర్శిస్తూ, ప్రధాన కూడళ్లలో నేతలతో భేటీ అవుతున్నారు.

శుద్ధజలంతో వ్యాధులు దూరం

- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పట్టణంలోని 15వ వార్డులో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

సత్తెనపల్లి: ప్రభుత్వం ప్రజల వైద్యం, ఆరోగ్య కోసం విశేషంగా కృషి చేస్తోందని, స్వచ్ఛమైన శుద్ధజలంతో వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో గెయిల్ కంపెనీ అందించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి అంబటి మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు గెయిల్ లాంటి కంపెనీలు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను సమీకరించి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కంపెనీ సహకారంతో నియోజకవర్గంలోని ఐదు ప్రాంతాల్లో తాగునీటి శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క ఆర్వో ప్లాంట్ కు రూ.5.42 లక్షలు చొప్పున రూ.27.01 లక్షలు వెచ్చించటం జరిగిందన్నారు. మూడేళ్ల ఈ కంపెనీ సర్వీస్ అందిస్తుందన్నారు. అనంతరం మంత్రి అంబటిని గెయిల్ కంపెనీ ప్రతినిధులు సత్కరించారు. నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, కౌన్సిలర్ గంటా రమణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గంటా ఏసుబాబు, గడ్డం వెంకటేశ్వర్లు(బుల్లోడు), నాగుల్‌బాషా, గెయిల్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

4వ వార్డులో ఇఫ్తార్ విందు

సత్తెనపల్లి: సర్వ మానవాళి సంతోషంగా ఉండాలని ముస్లింలు చేసే ప్రార్థనలు ఫలించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 4వ వార్డులో శుక్రవారం రాత్రి షేక్ సాధిక్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లిం కుటుంబాలు ఉన్నతంగా ఎదగాలని మంత్రి అంబటి ఆకాంక్షించారు. ముందుగా ముస్లిం పెద్దలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూరు మేస్త్రి షేక్ జానీ, మీరావాలి పాల్గొన్నారు.

నకరికల్లులో మంత్రి అంబటి పర్యటన

నకరికల్లు: రక్షిత మంచినీటిని పొదుపుగా వాడుకుంటే అందరి దాహార్తి తీర్చవచ్చని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక పాతూరులోని మంచినీటి ప్లాంటును మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురై ప్రాణాపాయం నుంచి బయట పడిన చిన్నారి మహ్మద్ అనస్‌ను పలకరించారు. ఒకవార్డు వార్డు సభ్యురాలి భర్త, పార్టీ నాయకుడు గుంటూరు ఖాదర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

సత్తెనపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధన, పట్టుదల, త్యాగ నిరతి నేటి సమాజానికి ఆదర్శనీయమని సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వర రావు అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్యవైశ్య, యువజన, మహిళా సంఘాలు, వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గాంధీచౌక్ లో ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం పట్టణం లోని మెయిన్‌రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు చిల్లంచర్ల కల్యాణ్, జవ్వాజీ లక్ష్మి, చలువాది హరికుమార్, పెరుమాళ్ల లక్ష్మీశివనారాయణ, కొత్త రామకృష్ణ, కాపుగంటి రత్తయ్య, జవ్వాజి రామ్మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు, తది తరులు పాల్గొన్నారు.



గాంధీచౌక్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

అభివృద్ధి పనులు ప్రారంభం

క్రోసూరు: ఎర్రబాలెం గ్రామం ఎస్టీ కాలనీలో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్, సీసీ రోడ్లను ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా శనివారం ప్రారంభించారు. అనంతరం ఉయ్యందన గ్రామంలో బీసీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, పార్టీ మండలాధ్యక్షుడు అప్పారావు, రామాంజనేయులు, కందిమళ్ల హనుమంతరావు, గల్లాగురుపాదం, మంకు వెంకటేశ్వర్లు, లేళ్లచిరంజీవి, దేవండ్లవేలాద్రి, బాలయ్య పాల్గొన్నారు.



హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

బెల్లంకొండ: మండల కేంద్రంలో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయాన్ని జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్ నందు మండల పార్టీ నాయకులు పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరుణంలో ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బద్దూరి చంద్రారెడ్డి, అక్కల వెంకట్రామిరెడ్డి, దండా సత్యనారాయణరెడ్డి, పుణ్యాల వెంకటేశ్వరరెడ్డి, మౌలాలి, గడపర్తి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): గోళ్ళపాడు గ్రామంలో వేంచేసి యున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పలు రకాల పూలతో అందంగా అలంకరించి, విశేష పుష్పార్చన, ఆకు పూజ నిర్వహించారు. నలభై రోజుల హనుమత్‌దీక్షను భక్తులు విరమించారు. పొంగళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం హనుమత్ జ్యోతి దర్శనం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రోసూరు: అండర్ 14 సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల్లో స్థానిక సెయింటాన్స్ పాఠశాల బాలికలు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సిస్టర్ మేరీ రజిత శనివారం తెలిపారు. శుక్రవారం అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి జట్ల ఎంపికల్లో రాష్ట్రం నుంచి 13 జిల్లాల నుంచి దాదాపు 200 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. విద్యార్థినులు కె.తిరుమల, కె.దీవెన ప్రతిభతో రాష్ట్ర జట్టుకి ఎంపిక కావటం జరిగిందన్నారు. హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు మక్కెన వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈసీ నియమావళిని అమలు చేయాలి



అమరావతి: గ్రామాల్లో ఎన్నికల కమిషన్ నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని ఎంపీడీఓ జి.రాణి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రభుత్వ, పబ్లిక్ స్థలాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. శాంతి భద్రతల రక్షణకు రెవెన్యూశాఖ, పోలీస్‌శాఖ సహకారం తీసుకోవాలన్నారు. ఈవోఆర్డీ శ్రీనివాసన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



క్రోసూరు: స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యులు షేక్ జమీల గఫూర్ పాల్గొన్నారు. యూకేజీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మేరీ రజిత విద్యార్థులు సాధించిన విజయాలు తల్లిదండ్రులకు తెలియజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కెనాల్స్ ఏతు షేక్ ఇబ్రహీం ఉపాధ్యాయులు విజయకుమార్, బురాన్, పద్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విధేయతకు దక్కిన గౌరవం



పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

- పెదకూరపాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నంబూరు
- సంబరాలు చేసుకున్న పార్టీ శ్రేణులు
- కేక్ కట్ చేసి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికలలో పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఆ పార్టీ శనివారం ప్రకటించింది. దీంతో నియోకజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. భారీ బాణ సంచా కాల్చి తమ అభిమానం చాటుకున్నారు. యువకులు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అభిమానులతో కలసి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. జై జగన్.. జైజై జగన్ ..జై నంబూరు అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అవకాశం ఇచ్చారని, పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తామన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పెదకూరపాడును ప్రగతి పథంలో నడిపిస్తా...

పెదకూరపాడులో 'మీ కోసం.. మీ ఎమ్మెల్యే'లో నంబూరు శంకరరావు

పెదకూరపాడు: 'నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తున్నా.. ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం అంటే ఏంటో చేసి చూపించా.. మళ్లీ పెదకూరపాడులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేస్తాం' అని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం పెదకూరపాడులోని ముస్లిం కాలనీలో మీ కోసం – మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలు, యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేసి, మళ్లీ జగనన్నకే ఓటు వేస్తామని నినదించారు. కాలనీ వాసులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఘన స్వాగతం పలికారు. స్థానిక సమస్యలను తెలుకుంటూ అక్కడి సమస్యలను తెలుసుకుంటూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. శంకరరావు పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలే వైఎస్సార్ సీపీకి బలమని వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడు ముందుంటామన్నారు. వారి వెంట క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ బాష, ఎంపీటీసీ షేక్ బాజీ, యార్డు డైరెక్టర్ షేక్ సుభాని, కారు బాబు, వార్డు సభ్యులు గఫూర్, పార్టీ సినియర్ నేత రహీం తదితరులు ఉన్నారు.



చిరువ్యాపారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పొట్టిశ్రీరాములు త్యాగనిరతి ఆదర్శనీయం

నకరికల్లు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ నిరతి ఆదర్శనీయమని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. చేజర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొట్టిశ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్.లలిత అధ్యక్షత వహించారు. పాధ్యాయులు పఠాన్ మల్లిక, ఎస్.లలిత, చెరుకూరు వెంకటేశ్వర్లు, షేక్.మస్తాన్‌వలి, ఎ.సీహెచ్.వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్.హబీబ్, షేక్.గౌస్ విద్యార్థులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి

పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి

ముప్పాళ్ళ: మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏ.శ్రీనివాసరావు, ఏవీఎస్ రంగనాయకులు, శ్రీరామ్‌జగన్, అడ్డగిరి రామారావు, తాడేపల్లి కోటిలింగం, బాపన పల్లి సాంబయ్య పాల్గొన్నారు.

పాటిబండ్లలో టీడీపీకి షాక్

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి షాక్ మీద షాక్ తగులుతోంది. గ్రామాల్లో టీడీపీ కేడర్ ఆ పార్టీకి బైబై చెబుతున్నారు. అభ్యర్థి మారిన టీడీపీ కార్యకర్తలలో భరోసా లేక పోడంతో వైఎస్సార్ సీపీలో పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. ఇటీవల కాలంలో టీడీపీ పెట్టని కొటలా ఉన్న అమరావతి ముస్లింలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం మండలంలోని పాటిబండ్ల గ్రామంలో టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహించే 25 కుటుంబాలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే నంబూరు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా చేసిన అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఉపకరిస్తుందన్నారు. మరోమారు వైఎస్సార్‌సీపీ జెండా ఎగేరేందుకు కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉండి వారికి కష్టం వచ్చిన తోడుగా నిలుస్తామని శంకరరావు హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన ముఖ్యనాయకులు మన్నవ సాంబశివరావు, జెట్టి చిన్న శేషగిరి రావు, పెద్ద శేషగిరిరావు, ఉమ్మినేని విజయ్‌తో పాటు పలు కుటుంబాలున్నాయి.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

బెల్లంకొండ: వస్తువులు కొనుగోలు చేసే ముందు.. తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలను చూసుకుని కొనుగోలు చేయాలని కేజీబీవీ పాఠశాల ప్రిన్స్‌పల్ టి.ఉషారాణి తెలిపారు. మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కస్తూర్బా పాఠశాలలో భారత ప్రభుత్వ వినియోగదారుల సంబంధాలు, ఆహార ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ఆధ్వర్యంలో శనివారం బాలికలకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత ఆహార పదార్థాలను, వస్తువులను వినియోగించడం ద్వారా కలిగే అనర్థాలను బాలికలకు వివరించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన బాలికలు అంజలి, ప్రసన్న, అఖిల, ఎస్.క్లారా, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకౌంటెంట్ సుకన్య, జి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్